ప్రజాశక్తి

ఆదివారం 26 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

భూదందాలు ఆగేదెప్పుడు.?

- పోలీసులకు భారీగా అందుతున్న ఫిర్యాదులు
- ఇప్పటికే ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లపై సస్పెన్షన్ వేటు
- ఒంగోలు, మార్కాపురం కేంద్రంగా వెలుగుచూస్తున్న బాగోతాలు

మార్కాపురంలో భూకబ్జాలపై ఎస్‌పికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

భూదందాలు ఆగడం లేదు. ఫిర్యాదులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వాటిని పరిశీలించే తీరిక కూడా పోలీసులకు కనిపించడం లేదు. చాలా ఫిర్యాదులు పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. ఇప్పటికే ఒంగోలు పట్టణం వదిలి సుమారు 200 మందికి పైగా భూకబ్జాదారులు పరారీలో ఉన్నట్లు స్వయంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రకటించడం గమనార్హం. పాలకపక్ష నేతల అండదండలతోనే ఈ ఆగడాలు నడుస్తున్నాయి. అనేక భూకుంభకోణాల్లో పాలకపక్ష నేతల పాత్ర ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఇప్పటికే అనేక మందిపై ఫిర్యాదులు కూడా అందాయి. తాజాగా మార్కాపురం ఎమ్మెల్యే కుటుంబంపైనా ఆ ప్రాంతానికి చెందిన పలువురు శనివారం నాడు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. తమ భూములను కబ్జా చేశారని చెప్పారు.

ఈ వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. మరో వైపు అక్కడ సాగే భూదందాల విషయంలో వైసిపి రెబల్ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి నేరుగా ఎమ్మెల్యేపైనే ఇప్పటికే పలు ఆరోపణలు చేశారు. పలు కేసులకు సంబంధించి పత్రాలను కూడా ఆయన మీడియాకు ఇప్పటికే అందించారు. ఇక భూకుంభకోణాలన్నీ నకిలీ పత్రాలతోనే నడుస్తున్నాయి. వీటిని అడ్డుపెట్టుకొని వ్యవహారాలను సాగిస్తున్నారు. అందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలను పావుల్లా వాడుకుంటున్నారు. భారీగా ముడుపులు తీసుకొని రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన కొందరు అధికారులు యథేచ్ఛగా ఈ అక్రమ రిజిస్ట్రేషన్లకు తెరలేపారు. సమస్య ఎక్కడ ఉందో అక్కడ సిట్ అధికారులు దృష్టి సారించారు. కలెక్టర్‌తోపాటు సబ్‌కలెక్టర్లు కూడా తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించగా అన్ని అక్రమాలూ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే జరిగాయని గుర్తించారు. భూకుంభకోణాలకు ఆజ్యం పోసిన ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లను ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఒంగోలులో ఇద్దరు, వైపాలెంలో ఒకరిపై వేటు పడిన సంగతి తెలిసిందే. ఒంగోలులో సుమారు 52 డాక్యుమెంట్లు ఫేక్‌వని తేల్చారు. వైపాలెం సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు కారణం మార్కాపురం ప్రాంతంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లేనని తేల్చారు. కొందరు రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు కూడా ఇందులో భాగస్వాములయ్యారు. ఆఖరు నిమిషంలో వీళ్లు తప్పించుకున్నారు. ఏదేమైనా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పత్రాలు నకిలీవా? లేదా? అనే పరిశీలన చేయకుండానే వీటిని కళ్లుమూసుకుని రిజిస్ట్రేషన్లు చేశారు. భూకుంభకోణాలకు కారకులయ్యారు. బాధ్యతలు మరిచి ఎలా చేశారన్నదే ప్రశ్నగా మారింది. వీరి వైఖరి వల్ల ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోయింది. నకిలీ జీపీలు, నకిలీ వీలునామాలు, నకిలీ డాక్యుమెంట్లను పెట్టి ఆస్తులను అసలైన యజమానులకు తెలియకుండా రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కబ్జాలకు గురైన భూముల విలువే సుమారు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా. ఇంకా 200 మంది పరారీలో ఉన్నారు. వీళ్లు ఎవరి భూములు ఆక్రమించారు? అనేదీ తేలాల్సి ఉంది. సిట్ అధికారులు వచ్చిన కేసులను విచారించి కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే ఒంగోలులో 130కి పైగా కేసులు నమోదయ్యాయి. 60 మంది వరకూ అరెస్టయ్యారు. కొందరు ▶ 2లో



కనులవిందుగా ఉన్న జలపాతం

భైరవకోనలో జలకళ

కనులవిందుగా జలపాతం

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం భైరవకోనలో జలపాతం ఉధృతి పెరిగింది. పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. ఎత్తయిన కొండపై నుంచి జాలువారుతున్న ఈ జలపాతాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు భైరవకోనకు వస్తుంటారు. ఇటీవల కాలంలో మండలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ జలపాతం పూర్తిగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మండలంలో కురిసిన వర్షం కారణంగా భైరవకోనలో జలపాతం ఉధృతి పెరిగింది. ప్రస్తుతం కార్తీక మాసం కావడం, జలపాతం ఉధీతి పెరగడంతో భక్తులు అధిక సంఖ్యలో ఈ పుణ్యక్షేత్రానికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆలయ కార్యనిర్వహణాధికారి నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దా రమణారెడ్డి, సిద్దు వెంకట్‌రెడ్డి ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒంగోలులో సంతకాల సేకరణ కార్యక్రమంలో నేతలు

మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిద్దాం.. 2లో

కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

రోడ్డు కొట్టుకుపోయింది ఇక్కడే..

▶ 8లో

వర్షాలతో వర్రీ..

- కోతల సమయం కావడంతో రైతుల ఆందోళన
- నేలవాలుతున్న పంట
- తగ్గుతున్న ధాన్యం కొనుగోలు ధర

వర్షాల కారణంగా నేలకొరిగిన వరి పైరు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని వేమూరు, రేపల్లె, బాపట్ల వ్యవసాయ డివిజన్ల పరిధిలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణం లో కురుస్తున్న వర్షాలతో రైతులు నష్టపోయే పరిస్థితులు తలెత్తాయి. ఈ ప్రాంతంలో ఎక్కువభాగం వరి కంకులు బయటకు వచ్చి పాలు పోసుకోవడం, వరి పైరు కోతలకు సిద్ధమయ్యే దశలో ఉన్నాయి. ఈ సమయంలో గత కొద్ది రోజులుగా కొద్దిపాటి గాలులతో వర్షాలు కురియడంతో వరి పైరు నేలకు వాలుతుంది. దీంతో వరి కంకులు తాలుగా కావడం లేదా కంకులు పొలంలోనే పడిపోవడం జరుగుతుంది.

ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 86 వేల హెక్టార్లలో వరి పైరు సాగు చేశారు. ఇందులో ప్రస్తుతం అత్యధికంగా వరిపైరు కోతకు వచ్చి ఉంది. ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని, ధర కూడా మంచిగా ఉంటుందని రైతులు భావించారు. పంట చేతికి వచ్చేతరుణంలో వర్షాల రాకతో రైతుల పరిస్థితి దిక్కుతోచనట్లయింది. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం మద్దతు ప్రకటించింది గానీ ఇంకా కొనుగోళ్ళు ప్రారంభం కాలేదు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరికుప్పలు వేయడం తరువాత నూర్పిడిలు కాకుండా రైతులు వరి కోత యంత్రాలతో పనులు ప్రారంభించారు. ధాన్యం వ్యాపారులు కల్లాల్లోనే కొనుగోళ్ళు ప్రారంభించారు. కోతల ప్రారంభంలో 75 కిలోల బస్తాను రూ.1700 కు కొనుగోలు చేసిన వ్యాపారులు వర్షాలు పడుతున్న క్రమంలో ధాన్యం కొనుగోలు ధరను రూ.150 నుంచి రూ.200 మేర తగ్గించారు. వర్షాల కారణంగా ముందు ముందు ఎలా ఉంటుందో అన్న ఆందోళనతో రైతులు చేసేదేమీ లేక పొలంలోనే ధాన్యాన్ని తెగనమ్ముతున్నారు. నవంబర్ నెలాఖరు నాటికి ధాన్యం ▶ 2లో

భూ దందాలు ఆగేదెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

బెయిల్‌పై విడుదలయ్యారు. ఇంకా కీలక సూత్రధారులపై కేసులు నమోదు కాలేదు. వైసిపి నేతలను వదిలేశారనే విమర్శలున్నాయి. ఒకవైపు మాజీ మంత్రి బాలినేని భూకుంభకోణాల్లో ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరిస్తున్నారు. మరోవైపు వైసిపి నేతలు భూకబ్జాలకు పాల్పడుతూనే ఉన్నారు. పేర్నమిట్టలో 1979 నుంచి రైతులు సాగు చేసుకుంటున్న భూమిని ఓ వైసిపి మహిళానేత తాజాగా కబ్జా చేసే యత్నం చేశారు. దీనిపై మాజీ మంత్రి బాలినేని శిబిరంలోనూ చర్చ నడుస్తోంది. మొన్ననే బాలినేని మండువారిపాలెం జీపీఏ విషయంలో మేయర్‌పైనే ఆగ్రహం వ్యక్తం చేస్తే మళ్లీ ఇలాంటి కబ్జాలు ఏమిటనే చర్చ సాగుతోంది. ఏదేమైనా పాలకపక్ష నేతల ఆగడాలు అటు పార్టీ ముఖ్యనేతలకూ తలనొప్పిగానే మారాయి. ఫిర్యాదులు చూస్తుంటే ఈ చిక్కుముడి ఇప్పట్లో వీడేలా కనిపించడం లేదు. భూకబ్జాలపై సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సిట్టింగు జడ్జితో విచారణ చేపట్టాలని తీర్మానించారు. భూకుంభకోణాలను విచారించేందుకు ఏర్పాటు చేసిన సిట్ విభాగంలో సరిపడా అధికారులు ఉన్నారా? లేదా? అనేదీ చూడాలి. భూముల పత్రాలను పరిశీలించి నిజమైన హక్కుదారులను తేల్చాల్సిన ప్రక్రియే కీలకంగా మారింది. ఇదే కష్టతరమైన ప్రక్రియ. దీనిపై పోలీసులు కుస్తీలు పడుతున్నారు. మరోవైపు రాజకీయ ఒత్తిళ్లు ఆటంకాలుగా మారాయి. వీలైనంత త్వరగా భూదందాలకు పోలీసులే తెరదించాల్సి ఉంది.

వర్షాలతో వర్రీ..

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు గానీ ఈ మేరకు సన్నాహాలు ప్రారంభం కాలేదు.

రైతులు పండించిన ధాన్యాన్ని ఈ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులిస్తూ.. జిల్లాలో 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. క్వింటా కామన్ రకం ధాన్యంకు రూ.2,183, గ్రేడ్ 'ఏ' రకం క్వింటా ధాన్యంకు రూ.2,203 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో 153 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. కేంద్రాలు ప్రారంభించడానికి 80 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 130 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 106 మంది హెల్పర్లను నియమించే పనులు జరుగుతున్నాయి. ధాన్యం కొనుగోలు పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయో ఇంకా వెల్లడి కాలేదు. గతేడాది ధాన్యం కొనుగోలు అనంతరం నగదు జమ చేయడంతో జాప్యం జరిగింది. ఈ కారణంగా కూడా అప్పులు తెచ్చి వరి సాగు చేసిన రైతులు ఆగే పరిస్థితి లేక తాము పండించిన పంటను తక్కువ ధరలోనే అమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. అధికారులు తక్షణమే ధాన్యంను మద్దతు ధరపై కొనుగోలుచేసి ంగా వారి ఖాతాల్లో నగదు జమయ్యేలా చూడాల్సి ఉంది.

సామాజిక ఆరోగ్య అధికారుల నిరసనకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-పొదిలి

సామాజిక ఆరోగ్య అధికారులు వేతనాలు బకాయిలు, ఇతర సమస్యలపై చేపట్టిన నిరసనకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక ఆరోగ్య అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అమలుచేయకపోగా ఇస్తున్న అరకొర వేతనాలు కూడా 10 నెలలుగా చెల్లించకుంటే ఆ కుటుంబాలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. వేతన సవరణ చేయాలని, ఉద్యోగ భద్రత, వేతనం బకాయిల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని తెలిపినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సామాజిక ఆరోగ్య అధికారులు ఈపాటికే ఆన్ లైన్ లో ప్రభుత్వానికి సమాచారం పంపించటం నిలిపివేశారని మరింత ఉధృతం కాకముందే ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి వేతన బకాయిలు విడుదల చేయటంతో పాటు వేతన సవరణచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సామాజిక ఆరోగ్య అధికారులు చేసే ఎటువంటి ఆందోళనకు ఐనా సిఐటియు మద్దతుగా పాల్గొంటుందని అన్నారు.

హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ప్రజాశక్తి-కనిగిరి

నల్సా పథకం 2015పై శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కనిగిరి మండల న్యాయ సేవాధికారి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె భరత్‌చంద్ర అధ్యక్షతన కనిగిరి పట్టణంలోని పవిత్ర ఫంక్షన్ హాల్‌లో న్యాయ సేవా శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ భారతి పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్ శాఖ, గిరిజన శాఖ,అటవీ శాఖ, పురపాలక శాఖ, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, మెప్మా, ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో గిరిజనుల దీర్ఘకాలిక సమస్యలు హక్కుల పరిరక్షణ చట్టాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆమె అన్నారు. నల్సా (పిల్లల స్నేహపూరిత న్యాయ సేవలు మరియు రక్షణ) పథకం 2015 అమలులో భాగంగా అన్ని విద్యాలయాలలో విద్యార్థులకు లీగల్ ఎయిడ్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి బాలల హక్కులు వారి రక్షణ కొరకు ఉన్న చట్టాలపై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న వ్యవస్థలపై అవగాహన కలిగించారు. సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శ్యామ్ బాబు మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల సేవలు గురించి వివరించారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోయినా ఎలాంటి సేవలకైనా న్యాయ సేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకొనిన ఎడల వారికి సత్వరమే న్యాయం చేస్తామని నల్సా పథకాలు, సేవలపై అవగాహన కలిగించారు. ఎక్సైజ్ కోర్టు స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి వెంకట స్వామి శర్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, ఫోక్సో చట్టం 2012పై అవగాహన కలిగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాశం పిచ్చయ్య, మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ గిరిజనుల చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల సేవలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిరిజనులకు ఆయుష్మాన్ ఆధ్వర్యంలో భారత్ హెల్త్ కార్డ్స్, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు చేతి కర్రలు, మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, మున్సిపాలిటీ కమిషనర్ నారాయణరావు, కనిగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణారెడ్డి, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు జిల్లా మండల న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు బాలలు తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనలో న్యాయమూర్తుల పూజలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో పూజలు చేశారు. ప్రకాశం జిల్లా జడ్జి ఏ భారతి, సీనియర్ సివిల్ జడ్జి కే శ్యాంబాబు, ఎక్సైజ్ కోర్టు జడ్జి అర్ వెంకటేశ్వర శర్మ, జూనియర్ సివిల్ జడ్జిలు కే భరత్ చంద్ర, కే భవ్య తదితర న్యాయమూర్తులు శనివారం భైరవకోన విచ్చేశారు. అక్కడి జలపాతాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం త్రిముఖ దుర్గాదేవి భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి, ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకట నరసయ్య, పంచాగ్నుల రామమూర్తి శర్మ, సుధాకర్‌శర్మ న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయమూర్తులను ఘనంగా సన్మానించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సీఐ కే శ్రీనివాసరావు, ఎస్ఐ అనిల్ కుమార్ ఉన్నారు.

న్యాయమూర్తులను సన్మానిస్తున్న ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ రమణారెడ్డి, పూజారులు

రాజ్యాంగ పరిరక్షణ కోసం 'చలో డిల్లీ'

ప్రజాశక్తి-కొండపి

రాజ్యాంగ పరిరక్షణకై డిసెంబర్ 4న చేపట్టిన చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కెజి మస్తాన్ కోరారు. శనివారం పెరిదేపి, మిట్టపాలెం గ్రామంలో దళితులపై దాడులను అరికట్టాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో దళితులపై నేటికీ దాడులు అత్యాచారాలు, హత్యలు సాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత హక్కుల సామాజిక, ఆర్థిక, భూమి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపట్టి సంతకాల సేకరణతో డిసెంబర్ 4వ తేదీన దేశ రాజధాని డిల్లీలో దేశవ్యాప్తంగా సంతకాలు సమీకరించి రాష్ట్రపతికి అందచేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెజి మస్తాన్, గడ్డం పిచ్చయ్య, చింతగుంట్ల అంకయ్య, గడ్డం వందనం, చేదర్ల ఏడుకొండలు, సాంసన్, చింతగుంట్ల ఎస్తేరమ్మ, పెరికల సుజాత, కొమ్ము కోటేశ్వరి, గడ్డం ఏసమ్మ, గడ్డం సౌజన్య, గడ్డం గోపి, గడ్డం రోసియా తది తరులు పాల్గొన్నారు.

జీవ పరిణామ క్రమంపై అవగాహన

ప్రజాశక్తి-పొదిలి

భూమి మీద మానవుడు కాలక్రమంలో పరిణామం చెందాడని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కే సుబ్రహ్మణ్యం అన్నారు. జీవ పరిణామ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి జన విజ్ఞాన వేదిక పొదిలి మండల శాఖ ఆధ్వర్యంలో కస్తూరిబా బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చార్లెస్ డార్విన్ గ్రంథం అమలులోకి వచ్చిన నవంబర్ 24న ప్రతి ఏడాది జీవ పరిణామ దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి సైన్స్ పట్ల, శాస్త్రీయ దక్పథం పట్ల ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. విశ్వం ఎలా ఏర్పడింది, జీవం ఎలా ఆవిర్భవించింది, మనిషి భూమిపై ఎలా ఏర్పడ్డాడు, కాలక్రమంలో ఎలా అభివద్ధి చెందుతున్నాడు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి దేవ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో దా వేదిక పొదిలి మండల అధ్యక్షులు జూపల్లి వెంకటేశ్వర్లు, కేజీబీవీ ప్రిన్సిపల్ ఎం అనురాధ, ఉపాధ్యాయులు కసుమూరు, ఎలిజిబెత్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

F.C.M.C.No 34/23

కానాపరపు ప్రసన్నలక్ష్మి ....పిటిషనర్

వర్సెస్

చేజర్ల కిషోర్ బాబు .... రెస్పాండెంట్

To
చేజర్ల కిషోర్ బాబు, తండ్రి రమణయ్య
ఉలిచి వాస్తవ్యులు, సాఫ్ట్ వేర్ ఉద్యోగి,
డోర్ నెంబర్ 3-216,సత్యనారాయణపురం
3 వ లైన్ ఒంగోలు.

పై నెంబరు న పిటిషనర్ నీపై భరణం కోరుతూ పైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా నీ నోటీస్ నిమిత్తం12.12.2023 తేదికి వాయిదా అయి ఉన్నది కావున నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట తేది 12.12.2023 న ఉదయం 10.30లకు మీరు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకునవలెను లేని యెడల నీ పరోక్షమున తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు ఇట్లు
తేదీ : 25-11-2023 జి.వి.సాగర్
పిటిషనర్ తరపు న్యాయవాది ఒంగోలు
సెల్ నెంబర్ 7893155055

IN THE COURT OF THE HONOURABLE XXI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS, AT :: HYDERABAD
O.S.No.2974 of 2023

Between :
M/s. Hyderabad Eye Institute
(Operating trust of L.V. Prasad Eye Institute)
...Petitioners/Plaintiffs
AND
Shri Pottikalapudi Koteswara Rao
...Respondents / Defendant

Shri Pottikalapudi Koteswara Rao S/o.
P. Raghavendra Rao, Aged about 26 years
R/o. Oguru (V), Kandukuru (M),
Prakasam Dist-5232105. A.P.

Whereas the Petitioners/Plaintiffs filed the above suit O.S. No. 2974 of 2023 for recovery of Rs. 2,71,965, 965.62 ps with 12% interest for unilateral breach of agreement to serve the Hyderabad Eye Institute and also for illegally retained amounts collected at Vision Centre, Nellore. Further summons and Register Post sent by the Honourable Court returned un-served as left.

The Honourable XXI Court has ordeed notice by publication in Prajasakthi newspaper to you and the case is posted to 18-12-2023 at 10-30 a.m. for your appearance and counter in court.

Take notice that in default of your appearance and to file counter by above said date the case will be heard and determined in your absence.

Date : 22-11-2023

Sd/-
By Order of the Court
G. SUDHA
Counsel for the Plaintiff
H.No.10-3-16/2, Humayun Nagar,
Hyderabad - 500 028.
Cell : 99858 04288

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

- పలుచోట్ల జెండర్ ఆధారిత హింస నివారణపై సభలు

ప్రజాశక్తి-మార్కాపురం

మహిళల రక్షణ చట్టాలపై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ తోట చందన కోరారు. స్థానిక డ్వాక్రా బజార్‌లో డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం సిబ్బందితో 'జెండర్' ఆధారిత హింస నివారణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలు చేసుకోవడం వలన కలిగే ఇబ్బందులను వివరించాలని తెలిపారు. మహిళా భద్రత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలను వాటి ప్రాముఖ్యతను మహిళలకు వివరించాలని కోరారు. మహిళలు పనిచేస్తున్న ప్రాంతాలలో, నివసిస్తున్న ప్రాంతాలలో ఏమైనా హింసకు సంబంధించిన ఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. మహిళలకు, బాలికలకు, గర్భవతులకు రక్తహీనత ఉండకుండా చూడాలన్నారు. అనంతరం మహిళల రక్షణ చట్టాలపై అవగాహన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రమేష్‌బాబు, ఎల్‌సి నాగభూషణం, సిసి స్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, అకౌంటెంట్, వివోఏలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: కొనకనమిట్ల వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమాన్ని స్థానిక ఇందిరా క్రాంతిపథం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వీడియో కాన్ఫరెన్స్, అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మహిళలపైన జరిగే హింస, బాల్య వివాహాలపై డ్వాక్రా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంఇఒ నరసింహారావు మాట్లాడుతూ గ్రూపు సభ్యులకు, స్కూళ్లలో బాల బాలికలకు, చదువు, జెండర్‌పైన అవగాహన కల్పిస్తామన్నారు. ఏపిఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 22వ తేదీ వరకు నాలుగు వారాలు పాటు వారానికి ఒక కార్యక్రమం చొప్పున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి వారం జెండర్ పైన, రెండో వారం బాల్య వివాహాల పైన, మూడో వారం రక్తహీనత పైన, నాలుగో వారం బాలికల చదువుపైన కార్యక్రమాలు గ్రామస్థాయిలో నిర్వహించి డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఎంపిడిఓ శ్రీనివాసమూర్తి, ఎంఇఓ నరసింహారావు, ఎపిఎం గోపాలకృష్ణ, సీసీలు ఎజ్రా, రామయ్య, రాజయ్య, వెంకటరెడ్డి, అకౌంటెంట్‌లు నాగమణి, అరుణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, విఎఎలు, మండల సమాఖ్య ఇసి సభ్యులు పాల్గొన్నారు.

మార్కాపురంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చందన

పిసిపల్లి: స్త్రీ పురుషుల మధ్య లింగ వివక్ష చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిసిపల్లి పోలీస్‌స్టేషన్ రైటర్ బి రవి హెచ్చరించారు. శనివారం వైఎస్ఆర్ క్రాంతిపథం మండల సమాఖ్య అధ్యక్షురాలు జి మరియమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక మాసోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ మహిళలపట్ల లింగ వివక్ష చూపరాదన్నారు. పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానమేనని అన్నారు. వారికి ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పించిందన్నారు. ఈ సందర్భంగా పిసిపల్లి ఎపిఎం జి సత్యానందం మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక మాసోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబర్ 22 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైంగిక వేధింపు నిరోధక చట్టం-2013 ప్రకారం మహిళలపట్ల పని ప్రదేశాల్లో కానీ, ఏ ఇతర ప్రదేశాల్లో కానీ వివక్ష చూపితే ప్రభుత్వం శిక్షిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగమణి, పిసిపల్లి సర్పంచి టి మరియమ్మ, సిసిలు రమణయ్య, శశిరేఖ, భ్రమరాంబ, విఓఎలు పాల్గొన్నారు.

కొండపి: గ్రామాలలో జరిగే బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవో కె సురేఖ తెలిపారు. శనివారం కొండపి వెలుగు కార్యాలయం వద్ద గ్రామ సంఘం, స్వయం సహాయ సంఘం, మండల సమాఖ్య సంఘాలు మహిళలతో ప్రతిజ్ఞ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుటుంబంలో ఉండే అమ్మాయిలు, అబ్బాయిలను అన్ని రకాలుగా సమానంగా పెంచుతామని, బాలికలకు ఇష్టమైన ఉన్నత విద్యను, ఉద్యోగాలను ముందుకు వెళ్లేందుకు ప్రోత్సహిస్తామని, మహిళలు సమాన పనికి సమాన వేతనం పొందేలా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్త్రీలకు, బాలికలకు హింసలేని జీవితాన్ని అందించడానికి అన్ని రకాలుగా కృషి చేస్తామని తదితర అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంపై నెలరోజులు కార్యక్రమం ప్రణాళిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రాజ్యలక్ష్మి, వివోఏలు, ఎంఎస్ఈసి, సిసిఎస్‌లు పాల్గొన్నారు.

పిసి పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, అధికారులు

పెద్దదోర్నాల: ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో శనివారం పెద్దదోర్నాలలోని సంస్థ ఆడిటోరియంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినం నిర్వహించారు. సమాజంలో మార్పు కోసం స్త్రీ పాత్ర ఎంత ముఖ్యమైనదో మెయింటినెన్స్ డైరెక్టర్ దాదా తెలిపారు. ఆర్డిటి సంస్థ పేదలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, అక్షరాస్యత, పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటిఎల్ వేమయ్య, పద్మజ తదితరులు మాట్లాడారు. వివిధ గూడేలకు చెందిన చెంచులు పాల్గొన్నారు.

కొనకనమిట్లలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసమూర్తి

పుల్లలచెరువు: పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు గురికాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని డిఆర్‌డిఏ ఏపీఎం నూనె వెంకటయ్య అన్నారు. శనివారం పుల్లలచెరువులో స్త్రీ హింస నిర్మూలన దినం నిర్వహించారు. ఆడ పిల్లలకు విద్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంజి వెంకిరెడ్డి, సీసీ నాగయ్య, వివోఎలు అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామసంఘ మహిళలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లి గ్రామంలో డిఆర్‌డిఏ, వైఎస్సార్‌కేపీ ఆధ్వర్యంలో ఏసీ లక్ష్మిరెడ్డి అధ్యక్షతన పొదుపు స్వయం సంఘాల మహిళలతో లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. ఈ సంధర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న డిఎల్‌డివో సాయికుమార్ మాట్లాడుతూ కుటుంబంలో మగ వారితో పాటు ఆడ పిల్లలకు కూడా సమానంగా అన్ని విషయాలలో వారికి అందాల్సిన హక్కులు కల్పించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. పని ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురి కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పబ్బిశెట్టి మంజుల శ్రీనివాస్, ఐకెపి సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

చట్టాలు మారినా స్త్రీకి రక్షణ కరువు

ఎన్ని చట్టాలు మారినా మహిళలకు రక్షణ కరువైందని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ బి పుష్పలత అన్నారు. శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని అంబేద్కర్ భవనంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలమైన చట్టాలు ఉన్నప్పటికీ అడుగడుగునా లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మరోవైపు సమాజంలో అమ్మాయిలకు భద్రత ఉండదనే ఒక్క కారణంతో చాలామంది తల్లిదండ్రులు తమ కూతుళ్లను ఉన్నత చదువులు చదివించేందుకు వెనుకాడుతున్నారని తెలిపారు. మహిళలు వారికి అవసరమైన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంకా అడ్వకేట్ మస్తాన్‌వలి, ఏటిఎల్ గిరిజ మాట్లాడారు. ముందుగా గిరిజన మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

రహదారిపై పడిన గ్రానైట్ స్లాబ్ రాళ్లు

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని గుళ్లపల్లి గ్రోత్ సెంటర్ దగ్గర శనివారం ఆయిల్ ట్యాంకర్‌ను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట సాయి బాలాజీ ఎక్స్‌పోర్ట్స్ నుంచి గ్రానైట్ స్లాబులతో నిండిన ట్రాక్టర్ రాంగ్ రూట్లో వచ్చి ఎదురుగా ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో గ్రానైట్ స్లాబ్ రాయి ముక్కలుగా విరిగి రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఉదయాన్నే మద్యం సేవించినట్లు సమాచారం.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిపై కేసు

ప్రజాశక్తి-రాచర్ల

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యా యుడిపై పోలీసు కేసు నమోదైంది. రాచర్ల మండలం చోళవీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువు తున్న విద్యార్థి సాయినాథ్‌ను ఆ పాఠశాల ఇంగ్లీష్ టీచర్ బత్తిన తిరుపతయ్య గత గురు వారం చితకబాదారు. విద్యార్థి మధ్యాహ్న భోజన అనంతరం నీరు తాగుతుండగా చేయిజారి గ్లాసు కిందపడి తేమకావడంతో కోపోద్రికుడైన ఇంగ్లీష్ టీచర్ తిరుపతయ్య సాయినాథ్‌ను కర్రతో కొట్టగా దద్దుర్లు కట్టింది. గమనించిన విద్యార్థి తల్లిదండ్రులు రాచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఇంగ్లీష్ టీచర్‌పై కేసు నమోదు చేశారు. సిఐ దేవప్రభాకర్ పాఠశాలకు వెళ్లి సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థి సాయినాథ్ గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గిద్దలూరు సిఐ దేవప్రభాకర్ కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన శనివారం చదలవాడ పశుక్షేత్రం సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. ఇంకొల్లు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన నిమ్మగడ్డ నాగరాజు ద్విచక్ర వాహనంపై ఇంకొల్లు నుంచి ఒంగోలు వైపు వెళు తుండగా అదుపు తప్పి లారీని ఢీకొనడంతో కిందపడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి, పోలీస్‌లకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ హరిబాబు సంఘటనా స్థలానికి చేరుకొని 108వాహనం రావడం ఆలస్యం కావడంతో మానవతా దృక్పథంతో తన వాహనంలో ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాగరాజు చికిత్స పొందుతున్నాడు.

27న భైరవకోనలో రెడ్ల కార్తీక వనభోజనం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో ఈ నెల 27న రెడ్ల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, భైరవకోన ట్రస్ట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ సిద్దు వెంకటరెడ్డి, బోయమడుగుల ఎంపిటిసి బైరెడ్డి తిరుపతిరెడ్డిలు తెలిపారు. భైరవకోనలో నిర్వహించే రెడ్ల కార్తీక వనభోజనం ఏర్పాట్లను శనివారం వారు పరిశీలించారు. రెడ్డి సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

సిఐటియు సంతాపం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయతీలోని పోతవరం పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దర్శి వెంకటలక్ష్మి నరసింహాశాస్త్రి(56) శనివారం మృతిచెందారు. ఆయన మృతికి పట్ల సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్ తీవ్ర సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని వారికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాము.

నూతన చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మికి అభినందనలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి నగర పంచాయతీ నూతన చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్ర రావును అణగారిన కులాల ఐక్యవేదిక జెఏసి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితో అణగారిన కులాల అభివృద్ధి కోసం, పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దోమల పుల్లయ్య, అణగారిన కులాల ఐక్యవేదిక జెఏసి వ్యవస్థాపక అధ్యక్షులు పేరం శ్రీనివాసరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి తొట్టెంపూడి రామారావు, కవి పిన్నిక శ్రీను, పద్మశాలీయ సంఘం నాయకులు సోమా యానాదిశెట్టి, కడవ రామకృష్ణ, జెఏసి నాయకులు కూడల మాలకొండయ్య, అరవ తిరుపతిరావు, గుండా చినవెంకటేశ్వర్లు, దోమల వెంకటేశ్వర్లు, డి నాగయ్య, పొదిలి బాలకాశయ్య, అత్యాల దావీదు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావును అభినందిస్తున్న అణగారిన కులాల ఐక్యవేదిక జెఏసి నాయకులు

యుటిఎఫ్ నూతన కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎంపిక జరిగింది. దాచూరి రామిరెడ్డి అనసూర్యమ్మ యుటిఎఫ్ సిఐటియు కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు జై కేశవరాజు ఆధ్వర్యంలో ముందుగా సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా ఎల్ బాలకోటయ్య, అధ్యక్షులుగా వల్లభుని శంకరరావు, సహాధ్యక్షులుగా వై రంగయ్య, ఎన్‌విసి ఉమ, మండల ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి వెంకయ్య, కోశాధికారిగా జే ప్రభాకర్‌రావు, మహిళా కార్యదర్శిగా ఏ హిమబిందు, మండల కార్యదర్శిగా ఎన్ సురేంద్ర, ఎస్ ప్రసాదరావు, వి వెంకటేశ్వర్లు, ఎస్ సునీల్ కుమార్ రెడ్డి, పి వలి, ఎన్ చెంచు రామారావు, మహిళా కమిటీ కన్వీనర్‌గా సిహెచ్‌వి కృష్ణకుమారి, కో-కన్వీనర్‌గా పి ఆండాలమ్మ, ఆడిట్ కమిటీ డి బాలకోటయ్య, కే శ్రీధర్, సాంస్కృతిక కమిటీలో బి శ్రీనివాస్‌రెడ్డి, పి ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారులు కోటపాటి నారాయణ, మహంకాళి నరసింహారావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు టి రామ్మూర్తి తదితరులు హాజరయ్యారు.

యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు వల్లభుని శంకరరావు, కొల్లూరి వెంకయ్య

మహిళలపై హింసను అరికట్టాలి

సెమినార్లో ఐద్వా జిల్లా నాయకురాలు టి సుభాషిణి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

మహిలలపై హిసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ చైతన్య బాలికల జూనియర్ కళాశాలలో సెమినార్ శనివారం నిర్వహించారు. సెమినార్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య అధ్యక్షత వహించారు. సెమినార్‌లో బార్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ బీమా లీలా కృష్ణ, సీనియర్ అడ్వకేట్ నందవనం ప్రసాదరావు, కిరణ్ కుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు టి సుభాషిని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పరిష్కారానికి ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం నవంబర్ 25న హింస వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ప్రతి గ్రామంలోనూ మహిళలు ఏదో ఒకచోట హింసకు గురవుతుందని అన్నారు. సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా, మానసికంగా జరుగుతున్న వేధింపులు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ విద్యార్థుల వరకు డ్రగ్స్‌కు విపరీతంగా అలవాటు పడుతున్నారని అన్నారు. యువతలో అవగాహన కార్యక్రమాలు మరెన్నో జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. అటువంటి కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ ముందుకు తీసుకురావడం సంతోషకరమైన పరిణామమని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోహనరావు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రేపల్లె : మహిళలపై హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం సదస్సును నిర్వహించారు. సదస్సుకు ఎస్ఎఫ్ఐ రేపల్లె గర్ల్స్ కో కన్వీనర్ హేమ అధ్యక్షత వహించింది. సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్ కుమార్ మాట్లాడుతూ 75ఏళ్ల స్వతంత్ర దేశంలో స్త్రీ లైంగిక వస్తువుగాని మారిపోయిందని అన్నారు. మహిళలపై హింస ఏదో ఒకచోట జరుగుతూనే ఉందని అన్నారు. లెక్కల పరిశీలిస్తే 2011లో రెండు లక్షల ఇరవై ఎనిమిది వేల మందిపైగా మహిళలు హింసకు గురైనట్టు కేసులు నమోదైతే 2022నాటికి నాలుగు లక్షల ఇరవై ఎనిమిది వేలపైగా కేసులు నమోదైనట్టు రికార్డులు చెబుతున్నాయని అన్నారు. హింసకు గురై పోలీస్ స్టేషన్ వరకు రానటువంటి కేసులు లక్షల్లో ఉంటాయని అన్నారు. సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురోగమిస్తున్నప్పటికీ ఇంకా అణిచివేత, హింసకు గురవుతున్నారని అన్నారు. కాలేజీ, స్కూలు, ఆఫీసు, పోలీస్ స్టేషన్ కూడా మినహాయింపు కాదని అన్నారు. ప్రభుత్వాలు తక్షణం గంజాయి, మద్యం, మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రజనీబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్ మహాలక్ష్మి, వరలక్ష్మి, నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

సెమినార్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు మణిలాల్

పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ బలరామకృష్ణమూర్తి

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. స్థానిక మసీదు సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. పట్టణానికి వచ్చేందుకు ప్రధాన రహదారి కావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని చెప్పారు. ముంతావారి సెంటర్లోని ఊటుకూరి వారి విధి రోడ్డు నిర్మాణం, మునిసిపల్ హై స్కూల్ గ్రౌండ్లో జరుగుతున్న పనులు పరిశీలించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు, మాగం మురళి, డిఇ ఐసయ్య, ఏఇ కట్టా రవి ఉన్నారు.

వెంకటేష్‌ను పరామర్శిస్తున్న డిబిఆర్‌పి నాయకులు జిలాని

వెంకటేష్‌కు పరామర్శ

ప్రజశక్తి - చీరాల

హైదరాబాద్ యశోధ హాస్పిటల్‌లో చికిత్స అనంతరం బంజారాహిల్స్ లోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబును మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి, కౌన్సిలర్ గోలి జగదీష్, డిఎస్ఆర్ హ్యాండ్లూమ్స్ అధినేత దామర్ల శివయ్య, పద్మావతి హ్యాండ్లూమ్స్ అధినేత ఆకురాతి వర్మ, డిబిఆర్‌పి నాయకులు ఎస్‌కె జిలాని శనివారం పరామర్శించారు.

పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేస్తున్న బాబ్జి, దేవరాజు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

పాస్టర్స్ ఇవాంజలిస్ట్ అసోసియేషన్ అధ్వర్యంలో రత్నరాజు బేతస్థ ప్రేయర్ హల్ ఆవరణలో పాస్టర్ అలెక్స్ అధ్యక్షతన సెమీ క్రిస్టమస్ వేడుకలు శనివారం నిర్వహించారు. వైసీపీ పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జీ, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరజు, మార్పు బాబు, లూథర్ శాస్త్రి హాజరై పాస్టర్లకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కోండ్రు బాబ్జి, డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ దైవ సేవకులకు ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు, పాస్టర్లకు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎల్లవేళల అతి తక్కువ ఖర్చుతో వైద్య సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. పాస్టర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రత్నరాజు, డానియల్, యేసుదాసు, వసంతరావు, సాల్మన్‌రాజు, చిట్టి బాబు, రవి, ఇసాక్, వెంకట్రావు, ప్రభుదాసు, జోషప్, రాజు, రామరావు, వైసీపీ నాయకులు పులిపాటి భూషణం, తలకాయల సుధీర్, తేళ్ల రాంబాబు, కప్పల సాయి, గొల్లపల్లి అనిల్, రత్నబాబూ, ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు సమావేశం

ప్రజాశక్తి - వేటపాలెం

ఏపీటీఎఫ్ మండల సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఎంపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం బ్రహ్మానందరెడ్డి, బొగ్గుల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జెడ్‌పి గర్ల్స్ హై స్కూల్ నందు జరిగే సమావేశంలో నూతన కార్యవర్గ ఎంపిక జరుగుతుందని తెలిపారు. కాబట్టి మండలంలోని ఏపీటీఎఫ్ కార్యకర్తలు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

వికసిత్ సంకల్ప యాత్ర ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. కేంద్ర నుంచి వచ్చిన వికసిత్ సంకల్ప యాత్ర వాహనాన్ని మండలంలోని ఈతేరు గ్రామంలో కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. వాహనంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్‌లో ప్రసారమవుతున్న 7.5 నిమిషాల నిడివిగల లఘు చిత్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలను చైతన్య పరుస్తూ ప్రదర్శించిన నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికే కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ సంకల్ప యాత్ర చేపట్టిందని అన్నారు. ఇప్పటి నుంచి 2024జనవరి 26వరకు జిల్లాలోని 459పంచాయతీల్లో యాత్ర సాగుతుందని అన్నారు. ఇందుకోసం జిల్లాకు నాలుగు వాహనాలు కేంద్రం నుంచి వచ్చాయని అన్నారు. ప్రతిరోజు నాలుగు రూట్లలో వాహనాలు పర్యటించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. జిల్లాస్థాయి, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేకంగా అధికారులతో కమిటీలు నియమించామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా కారణాలతో మిగిలిపోయిన అర్హులైన లబ్దిదారులకు పథకాలను వర్తింప చేయడమే ఉద్దేశం అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆయా పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని అన్నారు. మెరుగైన జీవన ప్రమాణాలతో ప్రజలంతా సాధికారతవైపు అడుగులు వేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గం సుగుమం చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పక్కా గృహాల నిర్మాణం, ఇంటింటికి కొలాయి కనెక్షన్‌తో తాగనీరు వంటి 17 రకాల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్డిఓ జి రవీందర్, డిపిఒ డి రాంబాబు పాల్గొన్నారు.

వికసిత్ సంకల్ప యాత్ర బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రంజిత్‌బాషా

నియామక పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రంగారావు

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - చీరాల

దేశానికి కాంగ్రెస్ అవసరం చాలా ఉందని కాంగ్రెస్ ఇంచార్జి దేవరపల్లి రంగారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. వేటపాలెం మండల అధ్యక్షునిగా యెనుమల సూర్య ప్రదీప్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కె సురేష్, బండ్లమూడి విజయ్ కుమార్, పీటర్ రమేష్, మెరుగ సురేష్ బాబు, షేక్ మస్తాన్, షేక్ బాషా, రహమ్మత్ అలీ, కోటయ్య, పెర్లి బుజ్జిరాజు, యెనుమల సూర్య ప్రదీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ డి సురేష్‌బాబు

ప్రజాసమస్యలపై చర్చ లేని సమావేశం

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిసపడు మండల సర్వసభ్య సమావేశం ఎటువంటి ప్రాధాన్యత లేకుండా శనివారం నిర్వహించారు. ఇచ్చిన సమయం ప్రకారం కోరం లేక వేచి చూశారు. 12:30 గంటలకు సమావేశాన్ని ప్రారంభించారు. 4శాఖల ప్రభుత్వ అధికారులు హాజరు కాలేదు. ఎంపిపి సాదినేని ప్రసన్న కుమారి మాట్లాడుతూ అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. ఎంపీడీఒ డి సురేష్ బాబు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర, వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో మండల ప్రజల సమస్యలు చర్చించ లేదు. సమావేశానికి జడ్పిటిసి టి వెంకటరమణ, తహశీల్దారు సుశీల, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోజి బాబు డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ దివ్యంగుల దినోత్సవం డిసెంబర్ 3నాటికి దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జోజిబాబు డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ప్రతినెల రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో భావపురి దివ్యాంగుల సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గోగన ఆదిశేషు అధ్యక్షతన శనివారం సభ నిర్వహించారు. సభలో జోజి బాబు మాట్లాడుతూ 2023జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 22లక్షల మందికి పైగా వికలాంగులు ఉన్నారని తెలిపారు. వికలాంగుల కనీస అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. నివాసం, వసతి, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పన పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటికైనా స్పందించి 18ఏళ్లు నిండిన వికలాంగులకు నివాస గృహం నిర్మించి ఇవ్వాలని కోరారు. వికలాంగుల కుటుంబానికి 300యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. వికలాంగుల జీవనోపాధికి బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ ఇవ్వాలన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ మాట్లాడుతూ దివ్యాంగులు ఐక్యతతో హక్కుల సాధన కోసం పోరాడాలని అన్నారు. టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దివ్యాంగులు తమ హక్కులు కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కర్లపాలెం, చీరాల, పర్చూరు, బాపట్ల వికలాంగుల సంఘం అధ్యక్షులు కంది వెంకటరెడ్డి, గురవయ్య, అశోక్, బాలసుందర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జోజిబాబు

పావులూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని పావులూరుకు చెందిన చెరుకూరి సుబ్బారావు (62) మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. గుంటూరు శంకర కంటి వైద్యులు పావులూరుకు వచ్చి కార్నియాలను సేకరించారు. దాత భార్య సుందరమ్మ, కుమార్తెలు ధనలక్ష్మి, పద్మ, మల్లేశ్వరిలను సోమేపల్లి రామమోనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, కరి కమలేశ్వరారావు, చుండి సాంబశివరావు అభినందించారు.

వైపాలెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని బూత్ నంబర్-26లో శనివారం టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ-ఇది బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్-26 ఇంచార్జ్ సయ్యద్ అల్లా మాలిక్ పరిధిలో ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలో భాగంగా టిడిపి అధికారంలోకి వచ్చాక మహాశక్తి పథకం ద్వారా మహిళలకు, ప్రజలకు అందించే పథకాల గురించి కరపత్రాలను పంచి వివరించారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్), నాయకులు తోట మహేష్ నాయుడు, షేక్ యాసుఫ్, దొంతా వెంకట్రావు గౌడ్, షేక్ ఇస్మాయిల్, చేదూరి లక్ష్మయ్య, యూనిట్ 3 ఇంచార్జ్ షేక్ రఫీ, బొందిలి కిషోర్ సింగ్, చేదూరి కిషోర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య, విద్యాభివృద్ధికి పెద్దపీట: మంత్రి సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రాష్ట్ర ప్రభుత్వం వైద్య, విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం పెద్దదోర్నాలలో రూ.మూడు కోట్ల నాబార్డు నిధులతో అధునాతన హంగులతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ కేవలం యర్రగొండపాలెం నియోజకవర్గానికే జగనన్న ప్రభుత్వం రూ.వంద కోట్లు ఖర్చు చేసిందన్నారు. దోర్నాలలో గిరిజనుల కోసం రూ.50 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. యర్రగొండపాలెంలో రూ.23 కోట్ల వ్యయంతో నిర్మించిన వంద పడకల వైద్యశాలను త్వరలోనే . మార్కాపురంలో రూ.450 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందులో ఐదు కళాశాలలను ప్రారంభించిన విషయాన్ని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైద్యసేవలకు దోర్నాల ప్రాంత ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా దోర్నాల వైద్యశాల స్థాయిని 30 పడకల నుంచి 50 పడకలను పెంచినట్లు తెలిపారు. అన్ని హంగులతో ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 50 మంది వైద్య నిపుణులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ముందుగా వైద్య సిబ్బంది మంత్రి సురేష్‌పై పూల వర్షం కురిపించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఐటిడిఎ పీవో డాక్టర్ బి రవీంద్రారెడ్డి, ఈతా విజయభాస్కర్, ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్, జడ్పిటిసి లతా చంద్రకాంత్ నాయక్, సర్పంచ్ చిత్తూరి హారిక, డిసిహెచ్ ఎస్‌వి మూర్తి, వైద్యశాల సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, పిఆర్ డీఈ సుబ్బారెడ్డి, ఎంపిడివో నాసర్‌రెడ్డి, వైసిపి నాయకులు మజీద్, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సురేష్

పెద్దారవీడు యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులుగా పాపయ్య, కార్యదర్శిగా యల్లమందారెడ్డి

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పడింది. మార్కాపురంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఈ ఎన్నిక శనివారం సాయంత్రం జరిగింది. అధ్యక్షులుగా యద్దనపూడి పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా డి యల్లమందారెడ్డిలు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా షేక్ అబ్దుల్ రహమాన్, సహ అధ్యక్షులుగా డి శ్రీనివాసులు, పి రూత్‌కుమారి, కోశాధికారిగా కెవి శ్రీనివాసులు ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ ప్రక్రియలో ఎన్నికల అధికారిగా వెన్నా వెంకటరెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా బి శ్రీరాములు, ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పి ప్రభాకర్ పాల్గొన్నారు.

పాపయ్య

యల్లమందారెడ్డి

చెరువుల్లో వర్షపు నీరు

ప్రజాశక్తి-సిఎస్ పురం

సిఎస్ పురం మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కుంటలు, చెరువుల్లో కొద్దిగా నీరు చేరింది. మండలంలోని వి బైలు, చెన్నపునాయునిపల్లి, రేగులచెలుక, అంబవరం గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల చెరువుల్లోకి నీరు చేరింది. దొక్కల వాగు ఉధృతంగా ప్రవహించింది. ఇప్పటివరకు మండలంలో ఎక్కడా చుక్కనీరు లేక కుంటలు చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం వాన కురవడం వల్ల కుంటల్లో నీరు చేరడంతో వారు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. పంటలు వేసుకునేందుకు రైతులు కూడా సిద్ధమవుతున్నారు.

సమన్యాయం కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి-దర్శి

అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని, అందరూ కాంగ్రెస్‌ను గెలిపించాలని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కైపు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. శనివారం దర్శి మండలంలోని పలు గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన అప్పులకుప్పగా మారిందని, అనేక హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే అందరూ సుభిక్షంగా ఉంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని బసిరెడ్డి, చందలూరు, కట్టసింగన్నపాలెం, యర్ర ఓబనపల్లి, గంగపాలెం, గణేశ్వరపురం, రామచంద్రాపురం, రాజంపల్లి, లక్ష్మీపురం, కొత్తపల్లి, గ్రామాల్లో పాదయాత్ర బృందం పర్యటించింది. దారిపొడవునా రైతులను, కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడోరోజు 23 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండల సమాఖ్య సేవకుల నిర్వహణలో డిసెంబర్ 13న జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరగనున్న గ్రాండ్ క్రిస్మస్ గోడ పత్రికను శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆవిష్కరించారు. జరిగింది. దోర్నాల మండల పాస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సింగా రాజేష్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, వైసిపి మండల కో-ఆర్డినేటర్ గంటా రమణారెడ్డి, దోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, పాస్టర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎలకపాటి ఇశ్రాయేలు, వైస్ ప్రెసిడెంట్ సింగా యేసుదానం, అడ్వయిజర్స్ చాట్ల గంగయ్య, సింగా రత్నాకర్, రికార్డు రైటర్ పూర్ణకంటి జేమ్స్, సింగా ఏసన్న, యలకపాటి ప్రేమన్న, బేతం యోహాన్, చాట్ల రాజు, బుట్టి అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-పొదిలి

ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక న్యాయవాది షేక్ షబ్బీర్‌కు ఉత్తమ సేవా పురస్కారం అందించారు. పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర చేతుల మీదుగా దీనిని అందజేశారు.

నేడు యూటీఎఫ్ కార్యాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

నేడు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ దర్శి డివిజన్ దాచూరి రామిరెడ్డి భవనాన్ని నూతనంగా ప్రారంభిస్తున్నట్లు జిల్లా కార్యదర్శులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, టి రాజశేఖర్, మండల అధ్యక్ష కార్యదర్శులు మీనిగ శ్రీను, కాశిం తెలిపారు. ముందుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో పొదిలి రోడ్డులోని టీచర్స్ కాలనీలో నూతన భవనాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభిస్తారన్నారు. అనంతరం జిల్లా కౌన్సిల్ సమావేశం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, గుంటూరు, కృష్ణా జిల్లాల శాసనమండలి సభ్యులు లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశానికి పాటు దర్శి, దొనకొండ, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలందరూ సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పెంపొందించుకోవాలని తాళ్లూరు మండల అభివృద్ధి అధికారి యుగంధర్ అన్నారు. శనివారం తాళ్లూరు మండలం బెల్లంకొండవారిపాలెంలో ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల గుర్తింపు, ప్రణాళికలు సంబంధించినవి తయారు చేయాలని ఆ శాఖ అధికారులను ఆమె కోరారు. ప్రస్తుత యేడాది ఉపాధి పనుల ప్రణాళికలు గత సంవత్సరం కంటే ఎక్కువగా ఇవ్వాలని కోరారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మురళీ, పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ గుడి చైర్మన్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విజయవాడలోని కనకదుర్గమ్మ గుడి చైర్మన్‌గా పని చేస్తున్న కర్నాటి రాంబాబుపై దాడి చేయడం అమానుషమని జాతీయ బీసీ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షులు పోసాని శ్రీరాములు పేర్కొన్నారు. యర్రగొండపాలెంలోని బీసీ జేఏసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ కర్నాటి రాంబాబు అత్యంత వెనకబడిన బీసీ కులమైన నగర కులానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీలపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని తెలిపారు. ఈ మేరకు దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపికి కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం లక్ష్మీనారాయణ, మండల యువజన నాయకులు నాగరాజు, వడ్లమూడి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్యారమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్యారమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి శనివారం తెలిపారు. పదవ తరగతి చదువుతున్న షేక్ నాగూర్‌వలి, అఖిల్, తొమ్మిదవ తరగతి విద్యార్థి రాఘవ నాయక్, ఎనిమిదవ తరగతి విద్యార్థి సంతోష్‌లు ఎంపికైన వారిలో ఉన్నారు. ఒంగోలులో జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ క్యారమ్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు విజేతలనుఆ పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఇన్‌చార్జి శ్యామ్ సుఖాకర్, తెలుగు ఉపాధ్యాయుడు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.జాహ్నవి ప్రియ, క్రిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య చర్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పివో సాయికుమార్, ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పచ్చిశెట్టి మంజుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తపట్నం: కొత్తపట్నం మండలంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన, మండల అభివృద్ధి అధికారి డాక్టర్ పి సుజాత ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలో వికసిత్ భారత సంకల్ప యాత్ర నవంబర్ 29 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గంలోని అందరూ, అధికారులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి సుజాత, తహశీల్దారు బివి రమణారావు, అల్లూరు ఎంపిటిసి మిట్నసల శాంతారావ్, కొత్తపట్నం ఎంపిటిసి చలంచర్ల తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఫిషరీస్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

28న ప్రజావేదిక

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఈనెల 28న ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో రామచంద్రరావు, ఏపీఓ వాక్యావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బందాలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సామాజిక తనిఖీ బందాలు తనిఖీలలో గుర్తించిన అంశాలపై ఈ నెల 28న స్థానిక ఎంపిడివో కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు ఈ ప్రజా వేదికలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అనాథలకు దేవాలయం 'కస్తూర్బా విద్యాలయం'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని కస్తూర్బా విద్యాలయంలో ఏడో తరగతి చదువుతున్న అనాథ విద్యార్థిని వి హర్షిణి పుట్టినరోజు వేడుకలు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో పి ఆంజనేయులు పాల్గొన్నారు. విద్యార్థినుల మధ్య హర్షిణి కేక్ కట్ చేసింది. అందరూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ తల్లికి కానీ, తండ్రిని కానీ కోల్పోయిన చిన్నారులు మనోధైర్యాన్ని కోల్పోకుండా వారి పట్ల ప్రేమ, ఆదరణ చూపిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవిని అభినందించారు. అదే విధంగా ప్రతి తరగతిలో ఉన్న అనాథ విద్యార్థులను ప్రత్యేక శ్రద్ధతో వారిలో చైతన్యం, ధైర్యం వెలుగును నింపి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం శుభ పరిణామమన్నారు. కస్తూర్బా విద్యాలయంలో ఉన్న తల్లి లేక తండ్రి కోల్పోయిన అనాథ విద్యార్థినులందరికీ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రిన్సిపాల్ తిరుమలాదేవి అనాథలకు అమ్మగా సేవలందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ గురమ్మ, కస్తూర్బా విద్యాలయం ఉపాధ్యాయులు స్వాతిబాయి, సక్కుబాయి, సునంద, సుజాత, జ్యోతి ఫ్లారెన్స్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లలితకుమారి

ఉపాధి పనులు గుర్తించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు కార్మిక బడ్జెట్టుకు అనుగుణంగా పనులు గుర్తించాలని ఎంపీడీఓ గుమ్మ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్లానింగ్ ప్రాసెస్‌పై శనివారం శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి తిరువీధుల ఉదయ్ భాస్కరి మాట్లాడారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్లు వారి వద్ద ఉన్న ఫోన్లో క్లార్ట్ యాప్ ద్వారా గుర్తించిన పనులను జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. ఆయా గ్రామాల్లో రైతులను వివరాలు అడిగి వారికి అవసరమైన పనులు గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కూలీలకు ఉపాధి అందే విధంగా గుర్తించిన పనులు ఉండాలని ఎంపీపీ, జడ్పీటీసీ సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శివపార్వతి, టిఏ సుధీర్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వరి ధాన్యం తూకం చూస్తున్న అధికారులు

వరి కోతల పర్యవేక్షణ

ప్రజాశక్తి - అమర్తలూరు (చెరుకుపల్లి)

అమర్తలూరు మండలంలో వరి కోతల ప్రయోగాన్ని శనివారం నిర్వహించారు. 23-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటకోత ప్రయోగంలో అమర్తలూరు గ్రామానికి చెందిన మల్లిపెద్ది జయప్రద ఎంటీయు1262 రకం 16.660 కిలో గ్రాములు దిగుబడి వచ్చినట్లు ఎఓ ఉయ్యూరు లోకేశ్వరి తెలిపారు. ఎకరాకు సుమారు 30బస్తాలు వచ్చినట్లు అవుతుందని తెలిపారు. కౌలు రైతు ఈవురి నాగరాజు చెందిన 25చదరపు మీటర్ల విస్తీర్ణంలో బిపిటి 5204 రకం 18.260కిలోలు నమోదు అయినట్లు తెలిపారు. అంటే ఎకరాకు సుమారు 33బస్తాల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. గుంటూరు ఎస్ఓ విజయ భాస్కర్, మండల గణాంక అధికారి కొండలరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు, ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనారిటీ సెల్ నియామక పత్రాలు పంపిణీ

కాంగ్రెస్ విజయానికి కృషి

ప్రజాశక్తి - బాపట్ల

రానున్న రోజుల్లో కాంగ్రెస్ విజయానికి మైనారిటీలు ఐక్యతతో కృషి చేయాలని కాంగ్రెస్ బాపట్ల జిల్లా మైనారిటీ అధ్యక్షులు పటాన్ రాజేష్ అన్నారు. బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు జెడీ శీలం సూచనల మేరకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు నేతృత్వంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బాపట్ల పట్టణ మైనార్టీ అధ్యక్షులుగా అమానుల్లా బేగ్, నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్‌గా నజీర్ హుస్సేన్, నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షులు అమీర్ బేగ్‌ను ఎన్నుకున్నట్లు రాజేష్ తెలిపారు. కేంద్రంలో మతతత్వ మోడీని గౌరవంగా గద్దెదించే బాధ్యతను క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ చేపడుతుందని అన్నారు. పార్టీ బలోపేతానికి నూతన మైనార్టీ కమిటీ పాటు పడుతుందని అన్నారు. కార్యక్రమంలో మీరావలి, బషీర్, రషీద్ పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం కల్పించాలి

మహిళా చైతన్యంపై విద్యార్థుల నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి - బాపట్ల

మహిళలు, బాలికలపై పెరుగుతున్న దాడులు ఎదుర్కొనే చైతన్యాన్ని వారిలో కల్పించాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల ఉల్లంఘనపై అధికారులు తక్షణమే స్పందించాలని అన్నారు. పోలీసు విభాగం నుండి హాజరైన జ్యోతి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని అన్నారు. స్త్రీ హింస వాస్తవ పరిస్థితులపై ఇంజనీరింగ్ విద్యార్థినిలు చేసిన ప్రదర్శనలు సభికులను ఆకర్షించాయి. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దోప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని హరిపద్మప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ షేక్ నజీర్, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జె వరలక్ష్మి, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ జె లక్ష్మి లలిత, ఎన్ఎస్ఎస్ అధ్యక్షురాలు వై శృతి, ట్రిపుల్ ఇ విభాగపతి ఎం రమాదేవి, ఫిజిక్స్ విభాగాధిపతి వి అరుణ, స్టూడెంట్స్ అంఫైర్స్ కన్వీనర్ నిరంజన్ బాబు పాల్గొన్నారు.

కారంచేడు : వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం నందు వెలుగు ఆధ్వర్యంలో మహిళలపై దాడులు, వివక్షపై శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఈనెల 25నుంచి డిసెంబర్ 23వరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళల పట్ల వివక్ష వద్దు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలపై దాడులు అరికట్టే విధంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదనరావు, సిసి అశోక్, వేణు, ఇస్సాకు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నవంబర్ 25నుండి డిసెంబర్ 22వరకు మాసోత్సవం జరుగుతుందని ఎంపీపీ డివి లలిత కుమారి, జెడ్పిటిసి తిరువీధుల ఉదయ భాస్కరి తెలిపారు. హింసను అంతం చేయాలని అన్నారు. ఆడపిల్లలందరినీ చదివించాలని కోరారు. బాల్య వివాహాలు నిషేధించాలని అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుండి గ్రామ పూర వీధుల్లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక రైల్వే గేటు సమీపంలో డ్వాక్రా మహిళలు, అంగనవాడి వర్కర్లు మానహారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, ఏపీఎం శ్రీమన్నారాయణ, మండల సమైక్య అధ్యక్షురాలు కర్ర స్వరాజ్యలక్ష్మి, సీసీ రజిని, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

అద్దంకి : జెండర్ మాసో త్సవాల్లో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయం నుండి మెయిన్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం హారంగా ఏర్పడి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. జాతీయస్థాయిలో మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎపిఎం కోటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా అన్ని పంచాయతీల్లో ర్యాలీ నిర్వహించి జెండర్ ప్రతిజ్ఞ చేయాలని గ్రామ సంఘాల విఒఏలకు తెలిపారు. ఈ మాసోత్సవాలలో బాల్య వివాహాలు, జెండర్ వివక్ష, మహిళలపై హింస వంటి విషయాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎసి కె రవికుమార్, ఏపిఎం ఎల్‌హెచ్ ఫణిబాబు, శ్రీనిధి మేనేజర్ పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా మహిళల ప్రతిజ్ఞ

నేరాల అదుపునకే కార్డెన్ సెర్చ్

బెల్లంఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - చీరాల

ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పి మహేష్ సూచనలతో డిఎస్పి ప్రసాదరావు పర్యవేక్షణలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామనగర్‌లో ట్రైనీ డిఎస్పి టి విద్యాశ్రీ, టూ టౌన్ సిఐ జి సోమశేఖర్, 1టౌన్ సిఐ పి శేషగిరిరావు, సెబ్ సిఐ సోమయ్య సిబ్బందితో రామనగర్ ప్రాంతాలలో కార్డన్ సర్చ్ నిర్వహించారు. టూ టౌన్ సిఐ సోమశేఖర్ మాట్లాడుతూ గతంలో ఆ ప్రాంతాలలో నివాసముండే కొంతమంది నాటుసారా, గంజాయి క్రయ, విక్రయాలకు సంబంధించిన కేసులలో పట్టుబడినందున ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టి కార్డన్ సెర్చ్ నిర్వహిం చినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని 8ద్విచక్ర వాహనా లు, 4ఆటోలు సీజ్ చేసినట్లు తెలిపారు. 150లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 4లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేపల్లె : చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చెయ్యడమే లక్ష్యంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డిఎస్పి టి మురళీకృష్ణ తెలిపారు. పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, సెబ్ అదికారులు సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ శనివారం నిర్వహించినారు. పట్టణ సిఐ నజీర్ బేగ్, పట్టణ ఎస్ఐలు, నగరం, నిజాంపట్నం, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, రేపల్లె సెబ్ అధికారులు, రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని 78మంది పోలీస్ సిబ్బంది సరైన పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. కొత్తవ్యక్తుల సమాచారాన్ని 100, 112లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసిన డిఎస్‌పి మురళీకృష్ణ



దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా 'రాజ్యాంగ' దినోత్సవం

ప్రజాశక్తి - చిన్నగంజాం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కుర్ర రామారావు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు విద్యా కమిటి ఛైర్మన్ జీవి రామకృష్ణరెడ్డి, ఎంఈఓ అజయ్ బాబు, రాజుబంగారుపాలెం హెచ్‌ఎం షేక్ కాలేష హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నక్కల వెంకటరావు, అడుసుమిల్లి అంకమ్మరావు, తోట రమేష్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు 150మందికి గుర్తింపు కార్డుల కోసం రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. దాతలను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు.

బాపట్ల : రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో స్థానిక మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించి శనివారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి, కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ఏవి రమణరావు, అధ్యాపకులు నైమేసాదేవి, భాస్కరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్య, ఉద్యోగ అవకాశాలు

ఎన్‌సిసి సభలో మాట్లాడుతున్న అనగాని హరికృష్ణ

ప్రజాశక్తి - నగరం

స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల నందు 76వ జాతీయ స్థాయి ఎన్‌సిసి దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అధ్యక్షత వహించారు. ఎన్సిసి విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారని అన్నారు. ఎన్సిసి బి, సి సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాలలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కళాశాలలో ఎన్సిసి విద్యార్థులు సమాజ శ్రేయసుకు క్రమశిక్షణతో చురుకుగా ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక సైనికుడిలా పనిచేయాలని సూచించారు. ఎన్సిసిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్సిసి అధికారి వి సాంబమూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాగంటి సుధాకరరావు, పి అమరేష్‌రెడ్డి, వల్లభనేని విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

వేటపాలెం : ఎన్‌సీసీతో విద్య, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పందిళ్లపల్లి జడ్పి ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా 5కిలోల కేకు కట్ చేసి శనివారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బి వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారి తోట వెంకటేశ్వర్లు, ఇతర సీనియర్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎన్‌సీసీ ఆవిర్భావం, లక్ష్యాలు, ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కాడేట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి వేటపాలెం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్ఐ జి సురేష్ శనివారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి గస్తీ ముగించుకొని వెళ్తున్న సమయంలో 216జాతీయ రహదారిపై వెళుతున్నట్లు గమనించి అదుపులోకి తీసుకొని అనుమతి కాగితాలను పరిశీలించారు. ట్రాక్టర్ డ్రైవర్ల బిక్క మొహం వేయడంతో నాలుగు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

ఆర్‌బికెల అనుసంధానం చేసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని డిపిఎం విరగాని వాణిశ్రీ కోరారు. మండలంలోని దేశాపేట ఆర్‌బికే-4 నందు ప్రకృతి వ్యవసాయంపై శనివారం సమావేశం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో సహజ సిద్ధమైన వనరులతో పంటల దిగుబడి తీయడంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఓ ఐ కాశీవిశ్వనాథ్, విఏఏ సెరెనా రాజ్ పాల్గొన్నారు.

వైసిపికి ప్రజాగ్రహం తప్పదు: నరేంద్రవర్మ

చీరలు పంపిణీ చేస్తున్న టిడిపి ఇన్‌చార్జి నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, వైసిపి నామరూపాలు లేకుండా పోతుందని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఇంటింటికి టిడిపి, మీ మాటే – నా బాట, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన శనివారం మాట్లాడారు. పట్టణంలోని 6వ వార్డు టిడిపి నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి విధానాలు వివరిస్తూ మహిళలకు ఒక చీర, సంచి అందజేశారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆడబిడ్డ నిధి నుంచి 18ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500 ఇస్తామని అన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి 3గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఫరిద్ మస్తాన్, మస్తాన్ వలి, జనసేన నాయకులు షేక్ అసిఫ్, ఇలాహి, అసిఫ్, మొహమ్మద్ ఖాన్, తాత చిన్నబాబు, శ్రీను, కోటి, తిరుపతిరావు, పల్లం సరోజినీ, శ్రీదేవి, రాణి, రజిని, మహాలక్ష్మి, రుక్మిణి, రామదేవి, రమాదేవి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక అద్దేపల్లి గ్రామంలో బాబు షఉటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి కార్యకర్తలు శనివారం నిర్వహించారు. టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటి తిరిగి ప్రచారం చేశారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని వివరించారు. గత నాలుగున్నరలుగా రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధికి దూరమయ్యారని ఆరోపించారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి అంశం టిడిపి అధికారంలోకి రాగానే పూర్తిస్థాయిలో అమలు జరుగుతుందని తెలిపారు. ఐలవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి టిడిపి కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి భట్టిప్రోలు పట్టణ కన్వీనర్ కుక్కల వెంకటేశ్వరరావు, నాయకులు ఎడ్ల జయశీలరావు, సిరాజుద్దీన్, కంభం సుధీర్, లంకా ప్రసాద్, మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు, దీపాల ప్రసాద్, అనగాని ఏడుకొండలు, తాతా వీరాంజనేయులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి కార్యకర్తలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ రామారావు

పాఠశాల వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్య వంతం చేయడంలో భాగంగా ప్రతి పాఠశాలలో వినియోగ దారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు డిఇఒ పివిజె రామారావు అన్నారు. వినియోగదారుల క్లబ్‌లు, వినియోగ దారులను చైతన్యపరిచే 9రకాల పోస్టర్లను ఎంఈఓలు ఉపాధ్యాయుల తో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలోని 212 వినియోగ దారుల క్లబ్‌ల ద్వారా ప్రతీ నెలా సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, శ్రీనివాసరావు, ఎంఈఓ–2 ప్రసాద్, ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు, మున్సిపల్ హై స్కూల్ పిడి కత్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్ : ప్రతి విద్యార్థి వినియోగదారుని హక్కులు తెలుసుకోవాలని మేలుకొలుపు కన్స్యూమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డి ఇమ్మానియేలు అన్నారు. వెదుళ్ళపల్లి జెడ్‌పి హైస్కూల్ నందు వినియోగదారుల హక్కుల అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు, వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. వస్తువుల తయారీ తేదీ, తుదిగడువు, తయారీ దారుని చిరునామా, నాణ్యత, బరువు తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డి మతీన్, పాఠశాల హెచ్‌ఎం రామచంద్రరావు, రాధాకృష్ణ, పిఇటి, మాజీ విద్యార్థికమిటీ చైర్మన్ పి శ్రీనివాసరెడ్డి, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పంగులూరు

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన జయప్రదం చేయాలని ఎంపీడీఓ రామాంజనేయులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, పోటీలను జరపాలని చెప్పారు. సచివాలయం పరిధిలో స్త్రీ, పురుషుల జట్లు 10కి తగ్గకుండా ఎంపిక చేయాలని సూచించారు. ఆటలు జరిపేందుకు గ్రౌండ్లను ఎంపిక చేయాలని చెప్పారు. ఎంపైర్స్, పీఈటీల సహకారం తో క్రీడలు జరపాలని అన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. కార్యక్రమం మొత్తం 45 రోజులపాటు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి ఈఓఆర్డి రాంబాబు పాల్గొన్నారు.

సమావేశంలో ఎంపిడిఒ రామాంజనేయులు

దళిత ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - రేపల్లె

దళితులు మేనమామని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దళితులకు విద్రోహం చేశాడని టీడీపీ జిల్లా కార్యదర్శి కూచిపూడి మోహనరావు ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 27దళిత పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. దళిత కాలనీల అభివృద్ధికి కేటాయించిన రూ.33వేల కోట్ల ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. అంబేద్కర్ విదేశీ విద్యను రద్దు చేసి, పేదలకు ఉన్నత విదేశీ విద్యను దూరం చేశారని అన్నారు. నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఎస్సీలకు రుణాలను కుదించారని అన్నారు. భూమి కొనుగోలు పథకం రద్దు చేశారని ఆరోపించారు. వాహనాల పథకం రద్దు చేసిన దళితులకు జగన్ ద్రోహం చేశాడని అన్నారు. 4ఎస్సీ నియోజక వర్గాల మధ్యనున్న అమరావతిలో టిడిపి ఏర్పాటు చేసిన రాజధానిని నీరుగార్చారని అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ దళితుడైన సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరీ చేసినా దళిత మంత్రులు నోరెత్తకపోవడం సిగ్గుచేటని అన్నారు. మాస్క్ అడిగినందుకు దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చంపేశారని ఆరోపించారు. ఇలా ఎందరో దళితులను దారుణంగా ఈ ప్రభుత్వం హత్య చేసిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి దళితులు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిడిపి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మోహనరావు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సిద్ధం

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 26నుండి 28వరకు పల్నాడు జిల్లా నరసరావు పేటలో జరిగే 33వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు సిద్ధమైందని ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామరెడ్డి తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలోని ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీలో బాలుర జట్టుకు గత నెల 26నుండి ఈనెల 28వరకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ జట్టుకు ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామస్తులు భవనం ప్రసన్నాంజనేయరెడ్డి, భవనం శ్రీమన్నారాయణరెడ్డి వారి తండ్రి భవనం అంజిరెడ్డి జ్ఞాపకార్థం రూ.15వేల విలువ చేసే క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. పంగు లూరు మండలం చిన్నమలవరం గ్రామానికి చెందిన మాజీ ఖోఖో క్రీడాకారుడు సచివాలయ ఉద్యోగి, కొప్పోలు వీరాంజనేయులు రూ.6వేల విలువచేసే క్రీడా దుస్తులను క్రీడాకారులకు బహుకరించారు. వీరికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఖోఖో క్రీడాకారులను ఎంపిక చేసి కోచింగ్‌కు పంపిన ఖోఖో జిల్లా కార్యదర్శి భవనం కాశీ విశ్వనాథండ్డి, జిల్లా ట్రెజరర్ కె హనుమం తరావుకు కృతజ్ఞతలు తెలిపారు. 25రోజులపాటు శిక్షణ నిర్వహిం చిన ఖోఖో తెలిపారు.

ఖోఖో రాష్ట్రజట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి ఖోఖో ప్రకాశం బాలురు జట్టు

ప్రకాశం జిల్లా ఖోఖో బాలుర జట్టు వివరాలను తెలిపారు. పంగులూరుకు చెందిన ఎ శ్రీనివాసు, ఎం కేశవ, ఎస్ నాగచైతన్య, యు ఆకాష్, పి వెంకటేశ్వర్లు, ఎ మధుబాబు, బి విష్ణువర్ధన్‌రెడ్డి, కనిగిరి మండలం కెవి పల్లికు చెందిన జి సందీప్, కె సాయి, ఎ నవనీత్ కుమార్‌రెడ్డి, వి నందకిషోర్, టి మనోజ్, కె విష్ణువర్ధన్, సి మనోహర్‌రెడ్డి, రుద్రవరంకు చెందిన ఆర్ వెంకటేష్, ఎం గంగవరంకు చెందిన వి నందకిషోర్, ఈ టీంకు కోచ్‌గా పంగులూరుకు చెందిన ఎ కోరేశ్ బాబు, మేనేజర్‌గా పంగులూరుకు చెందిన ఎన్ షాలెం రాజు వ్యవహరిస్తారని సీతారాంరెడ్డి తెలిపారు.

రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి -రేపల్లె

రాజ్యాంగ స్ఫూర్తిని విద్యార్థులు అలవర్చుకోవాలని స్థానిక ఏబీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ టిసి రవిచంద్ర కుమార్ అన్నారు. కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ టిసి రవిచంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. అడ్వకేట్ ఎ ప్రభాకరరావు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకొని విద్యార్థులు బాధ్యతగల పౌరులుగా ఉండాలని కోరారు. అధ్యాపకురాలు ఎన్ సుభాషిణి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవ ప్రదాన్యతని వివరించారు.

రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆయుర్వేద మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అంజమ్మ

విద్యార్థులకు చవన్‌ప్రాష్ పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పాఠశాల విద్యార్థులలో సాధారణ వ్యాధులు ప్రబలకుండా ఇమ్యూనిటీ పెంపొందించడానికి ఆయుర్వేదం అందిస్తున్న చవన్ ప్రాష్ ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానిక ఆయుర్వేద వైద్యశాల ఇంచార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి అంజమ్మ తెలిపారు. స్థానిక అంబెద్కర్ నగర్‌లోని ఎంపియుపి (ఏఏ) పాఠశాలలోని 120మంది విద్యార్థులకు చవన్ ప్రాష్ లేహ్యం ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది శనివారం పంపిణి చేశారు. కార్యక్రమంలో కొణిదెన ఆయుర్వేద వైద్యశాల కంపౌండర్ బొల్లాప్రగడ తనూజా, ఖాజాబీ, ఇంచార్జ్ హెచ్‌ఎం నెలకుర్తి ఆంజనేయులు, చింతల సుబ్బారావు, మువ్వా సుబ్రహ్మణ్యం, లేవి జోసెఫ్, కుమారి పాల్గొన్నారు.

ఐడి కార్డులు అందజేస్తున్న జెడ్‌పి సిఇఒ మోహనరావు

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

18సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి బిఎల్‌ఒలు ఓటు హక్కు కల్పించాలని వేమూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ సీఈఒ మోహనరావు సూచించారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి బిఎల్‌ఒల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఒక్కొక్క బిఎల్‌ఓ తప్పనిసరిగా 50మంది 18ఏళ్ల నిండిన యువతి యువకులకు ఓటు హక్కును కల్పించాల్సి ఉందన్నారు. ఆ మేరకు నేటి నుండే రోజుకు రెండు నుండి ఐదు వరకు ఓట్లు నమోదు చేయాలని సూచించారు. ఫారం 6, 7, 8లపై నమోదులో అవకతవకలు, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిసెంబర్ 15వరకు ఫారం 6, 7, 8నమోదు చేయటానికి అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో బట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాల తహసీల్దారులు, వీఆర్‌ఒలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న రోటరీ ప్రతినిధులు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు చెట్లు నాటడమే ప్రథమ కర్తవ్యంగా ప్రతి ఒక్కరికి చెప్పాలని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక మద్ది సత్యనారాయణ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో పిజిఎన్‌ఎఫ్, ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, కోశాధికారి చెరుకూరి నాగేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, చెన్నుపాటి బసవ రాములు, కొర్రపాటి కాజారావు, మురకొండ ఈశ్వరప్రసాద్, శాఖమూరి వెంకటరామయ్య పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

లింగ ఆధారిత వివక్ష సరికాదు

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లింగ ఆధారిత వివక్ష, హింస ఎంత మాత్రం సరికాదని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. 'లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం'లో భాగంగా ఈ నెల 25 నుంచి డిసెంబరు 22 వరకు డిఆర్‌డిఎ, మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వీటికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆయన ప్రకాశం భవనంలోని తన ఛాంబరులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ, మెప్మా పీడీ టి. రవికుమార్, ఐసిడిఎస్ పీడీ మాధురి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, డిపిఎంలు, వీపిఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదింపబడిన రోజు సందర్భంగా భారత రాజ్యాంగం ప్రస్తావన కరపత్రాలను కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్ దిబోరా, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాసరావు, గుదే రాజారావు, పొందుగల ప్రసాదరావు పాల్గొన్నారు.

15 రోజుల్లో క్లెయిమ్స్ పంపాలి: జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించి భూసేకరణలో నష్టపరిహార క్లెయిమ్స్ ను 15 రోజులలోగా తనకు పంపించాలని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలోని తన ఛాంబరులో ఈ అంశంపై వారితో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. 216, 565, 544(డి), బి. కె.వి., 167(బి), 765 జాతీయ రహదారులకు సంబంధించిన నష్టపరిహార క్లెయిమ్స్ స్థితిగతులపై ఆయన ఆరాతీశారు. సమావేశంలో జాతీయ రహదారుల అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీసీలపై కపటప్రేమ: ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో బీసీ భవనం నిర్మాణం కోసం తెలుగుదేశం హయాంలో రూ.50 లక్షల నిధులు మంజూరు చేయిస్తే వైసీపీ పాలకులు ఆ నిధులను పక్కదారి పట్టించి బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆరోపించారు. బీసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో బీసీలంతా ఏకమై జగన్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిద్దలూరు జడ్పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్, 2వ వర్డ్ కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, కొంగలవీడు సర్పంచ్ భూపాల్ యాదవ్ పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించండి

బిఎల్‌ఒలకు ఈఆర్‌ఒ విశ్వేశ్వరరావు ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ ను వేగంగా పరిష్కరించాలని ఒంగోలు ఆర్డీవో, నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు బిఎల్‌ఒలను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు, ఏఈఆర్‌ఒ.లతో శనివారం ఆయన స్పందన హాలులో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి పెండింగ్ దరఖాస్తుల స్థితిగతులపై సమీక్షించారు. సమావేశంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఒలు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై కఠినచర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే సోదరుడు అండదండలతో ఆక్రమణలు
- ఎస్‌పికి బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మార్కాపురం శాసనసభ్యుని తమ్ముడు కుందురు కృష్ణమోహన్‌రెడ్డి అండదండలతో మార్కాపురంలో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారని, రూ.కోట్లు విలువైన భూములను కబ్జాలు చేస్తున్నారని బాధితులు ఆర్.వెంకటనారాయణ, మందటి కృష్ణారెడ్డి జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబసభ్యులు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్‌పి మలికగార్గ్‌ను కలిసి భూకబ్జాలను వివరించారు. మార్కాపురంలో భూ ఆక్రమంగా పాల్పడిన అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కాపురం ప్రాంతంలో రూ.16 కోట్ల విలువైన స్థలం కబ్జా విషయంలో జవ్వాజి వెంకట రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, దొందా నాగరాజు గౌడ్ సూత్రధారులని, ఆకుల గాలయ్య అనే నకిలీ వారసుని తీసుకొచ్చి పొలాన్ని నకిలీ దస్తావేజులను, దొంగ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించి భూములను ఆక్రమించారన్నారు. విఆర్‌ఒ, తహశీల్దార్ సంతకాలు, అండగల్ ఫోర్జరీ చేశారన్నారు. గత సంవత్సరం జనవరిలో సర్వే చేసినట్లు ఒక్క రోజులోనే మార్కాపురం సర్వేయర్ సర్టిఫికెట్ ఇచ్చి ఎర్రగొండపాలెంలో రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. తమకు జరిగిన అన్యాయంపై మార్కాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నప్పటికీ పోలీసులు స్పందించడం లేదన్నారు. అధికారపార్టీకి చెందిన స్థానిక నేత అండదండల తోనే ఈ భూఆక్రమణలు జరిగాయని బాధితులు వాపోయారు. జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమపైనే తిరిగి కేసులు పెట్టిస్తున్నారన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను, భూములను ఆక్రమించి.. ప్రధాన భూమిక పోషించిన రంగారెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తే ఎన్నో భూ ఆక్రమాలు బయటకు వస్తాయన్నారు. విఆర్‌ఒ సంతకాలు కూడా ఫోర్జరీ చేయించిన సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఐదు కుటుంబాలకు చెందిన బాధితులు వారు కోల్పోయిన భూముల వివరాలతో సహా జిల్లా ఎస్‌పికి ఆధారాలు అందజేశారు. సిట్ అధికారులతో దర్యాప్తు చేయించి భూ ఆక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిద్దాం..

- 4న చలో ఢిల్లీకి తరలిరండి..
- వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, సామాజిక న్యాయానికి కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం సమాధి కడుతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శులు కంకణాల ఆంజనేయులు, బి.రఘురామ్ విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, దళితులు, అనగారిన వర్గాలపై జరుగుతున్న అకత్యాలు అరికట్టాలని డిసెంబర్ 4 న నిర్వహిస్తున్న చలో ఢిల్లీకి ప్రజలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమస్యలతో కూడిన అర్జీలను దేశవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి రాష్ట్రపతికి ఇచ్చేందుకు శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. డిసెంబర్ 4న జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. దళిత ప్రజాసంఘాల నాయకులు కొమ్ము సుజన్ మాదిగ, అంగలకుర్తి ప్రసాద్, రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కెఫ్ బాబు, సిహెచ్ వినోద్ లు పాల్గొని ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు, అట్లూరి రాఘవులు, అత్తింటి శ్రీనివాసరావు, వి మోజెస్, కాలే మల్లికార్జునరావు, డి నారాయణ, కొమ్ము బ్రహ్మయ్య పాల్గొన్నారు.

హింస లేని సమాజం కోసం ఉద్యమిద్దాం

ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు, విద్యార్థినులు

అంతర్జాతీయ హింస వ్యతిరేక దినం సందర్భంగా హింస లేని సమాజం కోసం ఉద్యమిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. రోజురోజుకీ సమాజంలో మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న హింస, అత్యాచారాలు అరికట్టాలని శనివారం లాయర్ పేట నాలుగు రోడ్ల కూడలిలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు యసడి షర్మిళ, ఐద్వా నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

ప్రజాశక్తి-రాచర్ల

మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గుడిమెట్ల నుండి దద్దవాడ వెళ్లే ప్రధాన రహదారి వర్షపునీటి ప్రవాహానికి కొట్టుకొని పోయింది. రోడ్డు వంతెన సమీపాన కాలువ వెడల్పు తక్కువగా ఉండటంతో నీటి ప్రవాహ ఉధతికి వంతెనతో సహ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో నాలుగు గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డు వంతెన కొట్టుకుపోయిన విషయాన్ని సిపిఎం రాచర్ల

నాలుగు గ్రామాలకు రాకపోకలు బంద్

మండల నాయకులు థామస్ సంబంధిత అధికారులకు తెలియజేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తాత్కాలిక చర్యలే చేపట్టారు. కానీ వాహన రాకపోకలు కొనసాగలేదు. త్వరలో వంతెన నిర్మాణం చేపట్టి రాకపోకలకు ముఖ్యంగా విద్యార్థుల స్కూలు బస్సుల రాకపోకలకు రోడ్డు పునఃనిర్మాణం చేపట్టాలని థామస్ అధికారులను కోరారు.

అధికారుల్లో కలవరం

బాపట్ల జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం అధికారులను కలవరపాటుకు గురి చేస్తుంది. ముఖ్యంగా ఓటర్ల జాబితా లోంచి పేర్లు తొలగించాలని కోరుతూ జిల్లాలో 42,923కు పైగా ఫారం-7 దరఖాస్తులు వచ్చాయి. అందులో 9,491 దరఖాస్తులు మాత్రమే తిరస్కరించారు. 28,099 దరఖాస్తులను ఈ రోల్ ఇంక్లూషన్‌లో పెట్టారు. ఈ ఓటన్నీ తొలగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 5,333 దరఖాస్తుల విషయమై తుది నిర్ణయం తీసుకోవలసి ఉన్నట్లు చెబుతున్నారు. ఫారం-7 దరఖాస్తులు జిల్లాలోనే అత్యధికంగా పర్చూరు నియోజకవర్గం నుంచి వచ్చాయి. ఈ నియోజకవర్గంలో టిడిపి చెందిన వారి దొంగ ఓట్లు 40 వేల వరకు ఉన్నాయని పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జీ ఆమంచి కృష్ణమోహన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు మండల గ్రామాల నుంచి వైసిపి చెందిన వారు 14,696 ఫారం-7 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలు చేశారు. ఓట్లను గంపగుత్తగా తొలగించే చర్యలకు పూనుకున్నారు. ఫారం-7 అంశం విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో చాలా నియోజకవర్గాల్లో అధికారపార్టీ నేతలు ఇదే పంథాలో వెళ్లి తమ పరిధిలో ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించే చర్యలకు పూనుకున్నారు. దీంతో టిడిపి నేతలు అప్రమత్తం అయ్యి గ్రామాలు, వార్డుల వారీగా ఓట్ల తొలగింపు ప్రక్రియపై దృష్టి సారించారు. కొన్ని చోట్ల అధికారులు ఏకపక్షంగా వ్యవహరించే పరిస్థితులు ఉన్న క్రమంలో ఎన్నికల కమిషన్, కోర్టులను ఆశ్రయించారు. అధికార పార్టీ నేతల మాట విని నిబంధనలకు వ్యతిరేకంగా వెళితే వారి ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు తలెత్తాయి. ఫారం-7 దరఖాస్తుల విషయంలో అధికార యంత్రాంగం ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు.

ఇప్పటికే పర్చూరు నియోజకవర్గంలో ఫారం-7 దరఖాస్తుల విషయంలో నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన మార్టూరు సిఐ టి ఫిరోజ్, ఎస్సైలు ఎన్‌సి ప్రసాద్, కె కమలాకర్, కె అనూక్ లపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ సస్పెన్షన్ వేటు వేశారు. తొమ్మిది మంది బిఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఫారం-7 దరఖాస్తు చేసిన 16 మందిపై పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఇదే కారణాలపై నెలన్నర క్రితం వరకు మార్టూరు తహశీల్దార్‌గా పనిచేసి బి.సురేష్‌బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. మరికొందరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అధికార, ప్రతిపక్ష నేతలు ఓటర్ల జాబితా సవరణ విషయంలో ప్రధానంగా ఫారం-7 దరఖాస్తులను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ అంశం ఉత్కంఠతను రేపుతోంది.

ప్రకాశం జిల్లాలో ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న భూకుంభకోణాలు అందరిలో కలవరాన్ని రేపుతున్నాయి. ఒంగోలు కేంద్రంగా బయటకొచ్చిన భూదందాలు జిల్లా అంతటా వెలుగులోకొస్తున్నాయి. తమ భూములు ఆక్రమణలకు గురైనా ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు బృందం ముందుకు కొల్లలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా ఎస్‌పిని కలిసి బాధితులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. వచ్చిన ఆరోపణల్లో అత్యధికంగా అధికార పార్టీ నేతలపైనే ఉంటున్నాయి. పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. అక్రమంగా భూములను రిజిస్టర్ చేసిన రిజిస్ట్రార్లు సస్పెండ్ అయ్యారు. కొత్తగా ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టలో భూభాగోతం వెలుగుచూసింది. మార్కాపురంలోనూ భూకబ్జాలపై బాధితులు శనివారం జిల్లా ఎస్‌పిని కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో సాగిన భూదందాలపై సమగ్రంగా విచారణ జరగాల్సి ఉంది. ఇందులో ప్రమేయం ఉన్నవారందరిపై కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సి ఉంది.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొందరికి మోదంగా ఉండగా కొందరికి ఖేదంగా ఉన్నాయి. కృష్ణా పశ్చిమ డెల్టాలో వరిసాగు చేసిన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. చేతికి అందివచ్చిన వరి పైరు కోత దశలో ఉండగా వర్షాలకు పైరు నేలకొరుగుతోంది. వరి కంకులు తడిచి రైతులకు నష్టం, కష్టాన్ని మిగులుస్తున్నాయి. కోతలు కోసి ఓదేలు వేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు వరికోత యంత్రాల ద్వారా కోసి అక్కడే అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే ఆలస్యంగా వరి నాట్లు వేసిన రైతులు మాత్రం ఈ వర్షాల వల్ల ఆనందంగా ఉన్నారు. సాగునీటి కోసం గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతూ వస్తున్న రైతులకు ఈ వర్షాలు ఆనందాన్నిస్తున్నాయి. గత కొంత కాలంగా వర్షాలు లేక మెట్ట రైతులు పంటల సాగుకు పూనుకోలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆరుతడి పంటలకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

అన్ని సామాజికవర్గాలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా కుల గణన నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీసంఘాల నేతలు కోరుతున్నారు. పేద ప్రజలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో కులాలపై ప్రజలకు స్పష్టత వచ్చేలా అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ ప్రాతిపదికపైనే సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యేలా చూడాల్సి ఉంది. నకిలీ ధ్రువీకరణ పత్రాల జారీ జరగకుండా చూడాలి. సంచార జాతులతో పాటు, కులాల మధ్య అంతరాలను తొలగించే దిశగా కులగణన నిర్వహించాల్సి ఉంది. సంక్షేమ పథకాలు సమానంగా అర్హులైన నిరుపేదలందరికి అందించడమే లక్ష్యంగా సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కుల గణన జరుగనుంది. కుల గణన సర్వే కోసం అత్యంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రత్యేక యాప్ ప్రవేశ పెట్టినట్లు చెబుతున్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటింటికీ తిరిగి కుల గణన సర్వేలో పాల్గొనబోతున్నారు. ఇలా జరిపే సర్వేకు ఎంతమేర చట్టబద్ధత వుంటుందోనన్న అనుమానాలు ఉన్నాయి. ప్రజల నుంచి సేకరించే కుటుంబ వివరాలు అత్యంత గోప్యంగా ఉండేలా సాఫ్ట్ వేర్ పనిచేస్తుందని చెబుతున్నారు. కులగణనకు ముందుగా ప్రజలకు అవగాహన కల్పించి దీనిపై ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సి ఉంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా